క్లుప్తంగా

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బాషయ్య



సమావేశంలో మాట్లాడుతున్న బాషయ్య

మంచాల: స్థానిక సంస్థల ఎన్నికలకు నేతలు సిద్ధం కావాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దన్నె భాషయ్య అన్నారు. గురువారం మంచాల బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనుందని అన్నారు. తదనుగుణంగా గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయడంతో పాటు పోటీకి సిద్ధం కావాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు జంగయ్యగౌడ్, జిల్లా నాయకుడు శ్రీశైలం, మండల ప్రధాన కార్యదర్శులు రాజు, రాజేంధర్‌రెడ్డి, నాయకులు.. పాండు, శేఖర్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హుస్సేన్ నాయక్‌కు సన్మానం



హుస్సేన్ నాయక్‌ను సన్మానించిన బీజేపీ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోతు హుస్సేన్ నాయక్‌ను బీజేపీ పార్టీ యాచారం మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ గురువారం కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను హుస్సేన్ నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. తప్పకుండా ఎస్టీల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు గణేష్ నాయక్, మంతన్‌గౌరెల్లి బూత్ అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు ఉన్నారు.

బుద్ధుడి స్ఫూర్తితో ముందుకు సాగుదాం

కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఐలయ్య



బుద్ధుడి విగ్రహం వద్ద నాయకులు

తుర్కయంజాల్: బుద్ధ పూర్ణిమను పురస్కరించుకొని గురువారం మాసబ్ చెరువు కట్టపైన గల బుద్ధుడి విగ్రహానికి పలు పార్టీల నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఐలయ్య, బీజేపీ ఎస్సీ మోర్చా నాయకుడు రమేష్ మాట్లాడుతూ.. గౌతమ బుద్ధుని బోధనల స్ఫూర్తితో అందరూ ముందుకు సాగాలన్నారు. హింసకు, వివక్షకు చోటులేని శాంతియుత సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజునాయక్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు



ప్రత్యేక అంకరణలో లక్ష్మీనృసింహస్వామి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం గురువారంతో ముగిసింది. మూడురోజుల పాటు నిర్వహించిన వేడుకల్లో చివరిరోజు పూర్ణాహుతి, చక్రస్నానం, సత్యనారాయణ వ్రతం, రథోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

15వ వార్డులో పారిశుద్ధ్య పనులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని 15వ వార్డు పరిధిలోని ఉదయనగర్ కాలనీలో గురువారం మురుగు కాలువలు, పరిసరాలను మున్సిపాలిటీ సిబ్బంది శుభ్రం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఉదయనగర్ కాలనీలో మురుగు కాలువలు నిండటంతో పాటు ఇళ్ల మధ్య వర్షపునీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ ప్రత్యేక చొరవతో గురువారం మున్సిపల్ సిబ్బందితో మురుగు కాలువలను శుభ్రం చేయించారు. రోడ్లు, ఇళ్ల మధ్య నీరు నిలువకుండా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ ఆఫీసర్ ఎల్లయ్య, వార్డు ఆఫీసర్ సంతోష, మున్సిపల్ సిబ్బంది చిన్నా, చిట్టిబాబు, గోపాల్, నర్సింహ, ప్రశాంత్, రామకృష్ణ, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

కౌన్ బనేగా వైస్ చైర్మన్?

- నేడు ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక
- ఆర్డీఓ అనంతరెడ్డి సమక్షంలో ప్రత్యేక సమావేశం
- బరిలో కౌన్సిలర్ బర్ల మంగ
- క్యాంపుల్లో మెజార్టీ కౌన్సిలర్లు



ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక శుక్రవారం జరుగనుంది. జిల్లా కలెక్టర్ శశాంక్ ఆదేశాల మేరకు ఆర్డీఓ అనంతరెడ్డి సమక్షంలో ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే ప్రత్యేక సమావేశంలో కొత్త వైస్ చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 24 మంది కౌన్సిలర్లు ఉండగా బీఆర్ఎస్‌కు చెందిన వైస్ చైర్మన్ ఆకుల యాదగిరిపై గత నెల 4వ తేదీన అవిశ్వాసం పెట్టగా అది నెగ్గింది. అయితే తదనంతరం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వైస్ చైర్మన్ ఎన్నికలో జాప్యం చోటుచేసుకుంది. తిరిగి కొత్త వైస్ చైర్మన్‌ను ఎన్నుకునేందుకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.

క్యాంపుల్లో కౌన్సిలర్లు

వైస్ చైర్మన్ ఎన్నిక నోటిఫికేషన్ వెలువడిన వెంటనే కౌన్సిలర్లు క్యాంపులకు తరలివెళ్లారు. అయితే వైస్ చైర్మన్ పదవిని ఆశిస్తున్న కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ బర్ల మంగ.. మెజార్టీ కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకున్నట్లు సమాచారం. వైస్ చైర్మన్ ఆకుల యాదగిరిని పదవి నుంచి దించేందుకు ఆమె వర్గీయులు నడిపించిన క్యాంపు రాజకీయాల గురించి అందరికీ తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పుడు వైస్ చైర్మన్ పదవికి నోటిఫికేషన్ వెలువడినందున ఎలాగైనా దక్కించుకునేందుకు అవసరమయ్యే బల నిరూపణ కోసం కౌన్సిలర్లను ముందస్తుగా క్యాంపులకు తరలించారు. శుక్రవారం ఉదయం నిర్ణీత సమయంలోపు మున్సిపల్ కార్యాలయానికి కౌన్సిలర్లు చేరుకుంటారని తెలుస్తోంది. 24 మంది కౌన్సిలర్లలో 13 మంది బర్ల మంగకు మద్దతుగా నిలిస్తే వైస్ చైర్మన్‌గా ఆమె ఎన్నికౌతారు. ఆ దిశగా ఆమె భర్త, తెలంగాణ ఉద్యమకారుడు బర్ల జగదీశ్‌యాదవ్, చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి వర్గీయులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కౌన్సిలర్లు బర్ల మంగకు మద్దతునిస్తున్నట్లు సమాచారం. ఈ పదవిని ఆశిస్తూ ఇంకా ఎవరైన పోటీలో ఉంటారా లేదా అనే అంశం శుక్రవారం తేటతెల్లం కానుంది.

కనులపండువగా కల్యాణం



లక్ష్మీ నరసింహ స్వామివారికి తలంబ్రాలు పోస్తున్న పూజారులు

ఇబ్రహీంపట్నం రూరల్: పోచారం గ్రామంలో లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవం గురువారం కనులపండగా జరిగింది. స్వామివారిని దర్శించుకోవడానికి పోచారం, కర్ణంగూడ తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్, ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ప్రభాకర్‌గౌడ్, అరుణ నరేందర్, దేవాలయ కమిటీ చైర్మన్ దాయి నరేష్ , నాయకులు వెంకటేశ్, చిన్నా, శ్రీశైలం, రమేష్, తిరుమల్‌రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.



హాజరైన భక్తులు

నేడు విత్తన మేళా

తలకొండపల్లి: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలనే ఉద్దేశ్యంతో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వారి ఆధ్వర్యంలో ఈనెల శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా పాలెంలో విత్తన మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రకాల పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తన రకాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అలాగే పంటల గురించి సమగ్ర సమాచారం, అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తిగల రైతులు 24న ఉదయం 10 గంటలకు పాలెం పరిశోధన స్థానానికి తరలిరావాలని ఏఓ కోరారు.

ప్లాస్టిక్ కవర్స్ వినియోగిస్తే చర్యలు

ఇబ్రహీంపట్నం: నిషేధిత ప్లాస్టిక్ కవర్స్ వినియోగిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. బుధవారం ఇబ్రహీంపట్నంలోని పలు షాపులు, హోటల్స్, వీధి వ్యాపారుల దుకాణాల్లో వారు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న ప్లాస్టిక్ కవర్స్‌ను స్వాధీనం చేసుకొని దుకాణాదారులకు జరిమానాలు విధించారు. మరోసారి వినియోగిస్తే దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని పెద్ద అంబర్‌పేట రెవెన్యూ సర్వే నంబర్ 244లోని ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్‌దత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. సర్వే నంబర్ 244లోని ప్రభుత్వ భూమిలో కొంతభాగంగా ఔటర్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం కింద ప్లాట్లు ఇవ్వగా.. మిగిలిన భూమిని పీఓటీ ద్వారా ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పట్టా పాసుపుస్తకాలను రద్దు చేసిందన్నారు. అయితే విజయవాడ జాతీయ రహదారికి ఆనుకుని ఈ భూములకు విపరీతమైన డిమాండ్ ఉండటంతో ఆక్రమణదారులు కబ్జాలకు పాల్పడంతో పాటు నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల నుంచి కాపాడి ప్రజావసరాలకు ఉపయోగించాలని ఆయన డిమాండ్ చేశారు.

క్రీడలతో ఆరోగ్యం

- స్నేహం కోసం టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయం
- బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి



విజేత జట్టు ప్రైజ్ మనీని స్నేహితుడి కుటుంబ సభ్యులకు అందజేస్తున్న వెంకట్‌రెడ్డి

చేవెళ్ల: స్నేహం కోసం టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని బీజేపీ జిల్లా కార్యదర్శి జి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. చేవెళ్ల మండలంలోని చనువెల్లి గ్రామంలో గురువారం ఎండీ నిజాముద్దీన్, ఎం. విజయ్‌కుమార్‌ల స్మారక క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, గ్రామ నాయకుడు శ్రీనివాస్‌చారి బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో యువకులంతా కలిసి గ్రామ పెద్దల సహకారంతో మృతి చెందిన స్నేహితుల జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడంతో పాటు బాధిత కుటుంబాలకు కూడా సహాయం చేయాలనే ఆలోచన హర్షించదగ్గ విషయమన్నారు. స్నేహితుల కుటుంబాలకు సహాయం చేయడంతో పాటు ఈ క్రీడలతో యువకుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయొచ్చన్నారు. అంతేకాకుండా క్రీడలతో ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. విజేతగా కేకేఆర్ జట్టు నిలిచిందని, సీఏస్‌కే రన్నరప్‌గా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు. విజేత జట్టు ప్రైజ్‌మని రూ.30వేల నగదును ఇదే వేదికపై స్నేహితుడు ఎండీ నిజాముద్దీన్ కుటుంబసభ్యులకు, రన్నరప్‌గా వచ్చిన ప్రైజ్ మనీ రూ.15వేలు కూడా ఎం. విజయ్‌కుమార్ కుటుంబసభ్యులకు అందజేశారు. అనంతరం నిర్వాహకులు యు. నర్సింలు, కె. రమేష్, శ్రీనివాస్, విశాల్, నాగేశ్, రవివర్మలు మాట్లాడారు. టోర్నమెంట్‌కోసం గ్రామ పెద్దలు పూర్తి సహకారం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జి. రాజేందర్‌గౌడ్, జి. వెంకట్‌రెడ్డి, పి. ప్రభాకర్‌రెడ్డి, పి. భూపతిరెడ్డి, వి. జంగారెడ్డి, తిరుపతిరెడ్డి, జైపాల్‌రెడ్డి, వెంకటేశ్, బాలక్రిష్టారెడ్డి, నర్సింలు, దీపక్‌రెడ్డి, జంగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చింటు పాల్గొన్నారు.

కళాకారులకు ఆర్థికసాయం

తలకొండపల్లి: మండల పరిధిలోని మాదాయిపల్లిలో బుధవారం రాత్రి రామాయణం స్టేజి నాటికను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత, శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి నాటక ప్రదర్శన ఖర్చుల నిమిత్తం ప్రోత్సాహరూపకంగా రూ.10,116 కళాకారులకు అందజేశారు. కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, కళాకారులు పాల్గొన్నారు.

కాలువ కబ్జాను అడ్డుకున్న అధికారులు



కాలువపై ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

హయత్‌నగర్: కాలువను మట్టితో పూడ్చి కబ్జా చేసేందుకు అక్రమార్కులు చేసిన ప్రయత్నాన్ని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు అడ్డుకుని ఆక్రమణలను తొలగించారు. హయత్‌నగర్ డివిజన్‌లో గురువారం జరిగిన ఈ ఘటన వివరాలు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింహ యాదవ్ కథనం ప్రకారం... హయత్‌నగర్ డివిజన్ ఇంజాపూర్ నుంచి హయత్‌నగర్ బాతుల చెరువులోకి వరదనీరు వచ్చే రాస కాలువను ఇంజాపూర్ వెళ్లే దారిలో కొందరు మట్టితో పూడ్చేశారు. రాత్రికి రాత్రి ప్రహరీ నిర్మాణం చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న జీహెచ్ఎంసీ లేక్ విభాగం ఏఈ నాగరాజు, టౌన్ ప్లానింగ్ అధికారి సత్తిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని డోజర్ సహాయంతో తొలగించారు. ఇంజాపూర్ నుంచి హయత్‌నగర్ బాతుల చెరువు వరకు 33 అడుగుల వెడల్పుతో ఈ కాలువ ఉంటుందని, గ్రామ నక్ష ప్రకారం కాలువకు హద్దులు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. కాలువను కబ్జా చేస్తే సహించేది లేదని, కాలువపై ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

మంత్రి కోమటిరెడ్డికి సత్కారం



మంత్రిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

తుర్కయంజాల్: రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని గురువారం మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు ఆయనను మినిస్టర్స్ క్వార్టర్స్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత గజమాలతో మంత్రిని సత్కరించారు. మంత్రిని కలిసిన వారిలో మున్సిపల్ అధ్యక్షురాలు మంగమ్మ, నాయకులు శివకుమార్, అర్జున్, గౌస్‌పాష, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించండి..

మంచాల: రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నగరంలో గురువారం మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు, ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిత్యా నిరంజన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మంచాల మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



తుర్కయంజాల్: సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా ఇందిరమ్మ కాలనీ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఇందిరమ్మ కాలనీ, సాయిప్రియ, అంజనాపురి కాలనీలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆపిల్ అవెన్యూ ఫీడర్ పరిధిలో 11గంటల నుంచి ఒంటిగంట వరకు ఆపిల్ అవెన్యూ కాలనీ, ప్రకాష్‌నగర్, మిథానీ కాలనీ, సుందరయ్య కాలనీ, లక్ష్మీనగర్, తిరుమల నగర్, శ్రీరంగాపురం, సాయినాద్ కాలనీ, అదేవిధంగా సీఆర్‌పీఎఫ్ ఫీడర్ పరిధిలో 3గంటల నుంచి 5గంటల వరకు సీఆర్‌పీఎఫ్ కాలనీ, నీలాద్రి నగర్, సాయిదయకాలనీ, స్నేహపురి కాలనీ, దుర్గా నగర్, తుల్జాభవానీ కాలనీ, వెంకటేశ్వర కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఆమనగల్లు మండలంలో..

ఆమనగల్లు: ఆమనగల్లు మండలంలోని వివిధ ఫీడర్‌లలో చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ ఏఈ సీతారాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలెపల్లిలోని 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విఠాయిపల్లి ఫీడర్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే మంగళపల్లి ఫీడర్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

అబ్దుల్లాపూర్‌మెట్ సబ్‌స్టేషన్ పరిధిలో..

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ సబ్‌స్టేషన్ పరిధిలోని పిగ్లీపూర్ మరియు కొత్తగూడెం ఫీడర్లలో విద్యుత్ తీగల మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుదని ఏఈ విద్యారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మరియు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పిగ్లీపూర్, నాయుడు కాలనీ, సాయినగర్ కాలనీ, కొత్తగూడెం గ్రామం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఆమనగల్లును ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఎమ్మెల్యే కసిరెడ్డితో మున్సిపల్ నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో గురువారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, కేఎస్ఆర్ యువసేన నాయకులు తాళ్ల రవీందర్, ఖాదర్ ఖాద్రీ, విజయ్‌రాథోడ్ తదితరులు కలిశారు. ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని కోరుతూ వారు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. ఆమనగల్లును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఆమనగల్లులో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి అధికారులతో చర్చిస్తున్నట్లు వివరించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రితో మాట్లాడి నిధుల మంజూరుకు ప్రయత్నిస్తామని ఎమ్మెల్యే చెప్పారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కొత్తూరు: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో గురువారం అనంత పద్మనాభస్వామి ఆలయంలో నిర్వహించిన స్వామివారి కల్యాణంలో ఆయన పాల్గొన్నారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం వారిని ఆలయ కమిటీ చైర్మన్ బెజవాడ అనితారెడ్డితో పాటు పలువురు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెంజర్లలో వెలసిన అనంత పద్మనాభస్వామి ఆలయానికి విశిష్టమైన చరిత్ర ఉందన్నారు. ఇక్కడ భక్తులు కోరిన కోరికలు తప్పకుండా తీరుతాయని చెప్పారు. భక్తుల విశ్వాసంతో ఆలయం దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు కూడా ఈ ఆలయాన్ని దర్శించుకుంటున్నట్లు వివరించారు. రానున్న రోజుల్లో ఈ ఆలయానికి ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం లేకపోలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, కొత్తూరు ఎంపీపీ మధుసూదన్ రెడ్డి, శివశకంర్‌గౌడ్, అగ్గనూరు విశ్వం, జె. సుదర్శన్‌గౌడ్, కృష్ణ, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హరితహారానికి సర్వం సిద్ధం

- మండలంలో రెండున్నర లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- ముమ్మరంగా గుంతలు తీసే పనులు
- జూన్ మొదటివారంలో మొక్కలు నాటే కార్యక్రమం!



మంచాల నర్సరీలో మొక్కలు

మంచాల: హరితహారం పథకం కింద మొక్కలు నాటేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే గ్రామాల్లో మొక్కలు నాటేందుకు గోతులు తీయడం వంటి పనులు ప్రారంభించారు. మంచాల మండలంలో 23 గ్రామ పంచాయతీల్లో.. ప్రతి జీపీలో 11వేల చొప్పున మొత్తం 2,53,000 మొక్కలు నాటుతారన్నారు. అందుకుగాను గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు కూడా పెంచారు. ప్రధానంగా పూల మొక్కలు.. గులాబీ, మల్లె, మందార, జామ, అల్లనేరడి, చింత, వేప, గుల్‌మోర్, టేక్‌మోర వంటి మొక్కలు ఉన్నాయి.

ముమ్మరంగా పనులు..

ఈ మొక్కలను కమ్యూనిటీ ప్లాంట్స్, రోడు సైడ్ ప్లాంట్స్, ఇంటర్నల్ రోడ్డు సైడ్ ప్లాంట్స్‌గా గుర్తించారు. రోడ్డు సైడ్ ప్లాంట్స్ కిలో మీటర్‌కు 400 మొక్కలు నాటనున్నారు. కమ్యూనిటీ ప్లాంట్స్ ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ భవనాల ఆవరణల్లో శ్మశానవాటికల వద్ద నాటనున్నారు. ఇప్పటికే గ్రామాల్లో దాదాపు 2,200 మంది కూలీలతో గోతులు తీసే పనులు ముమ్మరంగా నడుస్తున్నాయి. జూన్ మొదటి వారంలోపు మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించే అవకాశం ఉంది. రైతులు కూడా ముందుకు వచ్చి పొలంగట్ల చుట్టూ మొక్కలు నాటుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

> **అందరూ భాగస్వాములు కావాలి**
>
> 
>
> వన నర్సరీల్లో సిద్ధంగా ఉన్న మొక్కలు ప్రతి గ్రామంలో నాటిస్తాం. వర్షాలు ప్రారంభం కావడంతో ఇప్పటికే గోతులు తీసే పనులు చేయిస్తున్నాం. జూన్ మొదటి వారంలో అన్ని గ్రామాల్లో హరితాహారం కింద మొక్కలు నాటిస్తాం. ప్రజలందరూ హరితహారంలో భాగస్వాములు కావాలి.
>
> – వీరాంజనేయులు, ఏపీఓ, మంచాల